ఎంఈవో శంకర్‌రాథోడ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో అపర్ణ, పీఆర్‌టీయూ నేతలు

## ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

షాబాద్, డిసెంబర్ 5: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. ఆరు సంవత్సరాలుగా షాబాద్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి ఇటీవలే బదిలీపై రాజేంద్రనగర్ మండలానికి వెళ్లిన ఎంఈవో శంకర్‌రాథోడ్‌కు పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులందరితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అపర్ణ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు తప్పనిసరిగా ఉంటాయని చెప్పారు. ఉద్యోగులు తాము పనిచేసిన చోట అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, షాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, రాష్ట్ర బాధ్యులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోవింద్, సుశీల, అంజయ్య, ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాటర్‌ట్యాంకు బహూకరణ

పాఠశాలకు వాటర్‌ట్యాంకు బహూకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆమనగల్లు, డిసెంబర్ 5: పట్టణంలోని నవచైతన్య కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం లయన్స్ క్లబ్ సభ్యులు వీరబొమ్మ భిక్షపతి, వీరబొమ్మ రాంమోహన్ వారి తల్లిదండ్రులైన లింగమ్మ, నారాయణ జ్ఞాపకార్థం 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును అందజేశారు. వారి వెంట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు చంద్రశేఖర్, రమేశ్, కొండల్‌రెడ్డి, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నాగమణి భర్త శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 5 : కుల, మతాంతర వివాహాల చట్టాలు తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. రాయపోల్ గ్రామంలో హత్యకు గురైన కానిస్టేబుల్ నాగమణి భర్త శ్రీకాంత్‌ను గురువారం సీపీఎం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ, భాస్కర్ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే దళిత యువకుడు అదే గ్రామానికి చెందిన బీసీ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటే సహించలేని ఆమె తమ్ముడు పరమేశ్ తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకుందనే దురహంకారంతో మహిళా కానిస్టేబుల్ నాగమణిని దారుణంగా హత్యచేయటం బాధాకరమన్నారు. నాగమణిని హత్యచేసిన ఆమె తమ్ముడు పరమేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, యాదయ్య, నాయకులు జంగయ్య, జగన్, మండల కార్యదర్శి బుగ్గరాములు, జగన్, భిక్షపతి, రమేశ్, యాదగిరి, చరణ్, యాదయ్య పాల్గొన్నారు.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కమిటీ ఎన్నిక

కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 5 : మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కమిటీని గురువారం మండల ఇన్‌చార్జి సిద్దాపురం శ్రీకాంతమాదిగ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బాబు మాదిగ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సతీశ్, అధికార ప్రతినిధిగా మహేందర్, ఉపాధ్యక్షుడిగా నర్సింహ, సురేందర్, ప్రధానకార్యదర్శిగా అమరేందర్, సహాయకార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా సంజీవ, అనిల్, కార్యదర్శులుగా నరేందర్, పవన్, భాను, లింగం, అనిల్, భరత్, అజయ్, మహేశ్, ఆంజనేయులు, సంజీవ, చరణ్‌లను ఎన్నుకున్నారు.

## ప్రజలతో పోలీసులు స్నేహభావంతో మెలగాలి

మాడ్గుల, డిసెంబర్5: పోలీస్‌లు ప్రజలతో స్నేహపూరంగా ఉండాలి అని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. గురువారం మాడ్గుల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సంవత్సరంలో జరిగిన క్రైమ్, సిబ్బంది పనితీరు పలు రికార్డుల పరిశీలన, పాత కేసులు, పెండింగ్ కేసులను పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత కేసులను త్వరగా దర్యాప్తు చేయాలని సూచించారు. సక్రమంగా విధులకు హాజరు కావాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉండాలని చెప్పారు. సీఐ జగదీశ్ మాట్లాడుతూ నేటి నుంచి డిసెంబర్ 14 వరకు జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమన్‌గల్లు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలోని పోలీస్‌లు పాల్గొన్నారు.

# మట్టిని పరిరక్షించుకోవాలి

### నందిగామ వ్యవసాయ శాఖ అధికారి వాణి

నందిగామ రైతు వేదకలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి వాణి

నందిగామ, డిసెంబర్ 5: మట్టిని ఆరోగ్యంగా ఉంచితేనే పంటలు బాగా పండుతాయని నందిగామ మండల వ్యవసాయ శాఖ అధికారి వాణి అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతు వేదికలో గురువారం రైతులకు భూసార పరీక్షలు, మట్టిలో పోషకాల లభ్యత మెరుగుపరుచుకోవడం, సూక్ష్మ పోషకాలను పరిరక్షించే పద్ధతి, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ వరి కోసిన తర్వాత అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. అంతే కాకుండా మట్టిలో సూక్ష్మజీవులు నశిస్తాయన్నారు. కొయ్యలను కాల్చకుండా ఎకరానికి ఎస్ఎస్‌పీ 10 నుంచి 15 కిలోల యూరియా వరి కొయ్యలపై చల్లి నీరు పెట్టి దున్నాలన్నారు. ఆ తర్వాత 20 నుంచి 20 రోజుల్లో వరి కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి పంటలకు ఫాస్పరస్, సల్ఫర్ లభిస్తాయన్నారు. వ్యవసాయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా రైతు వేదికలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత

**రసాయనాల వాడకాన్ని తగ్గించాలి**

కడ్తాల్ : రైతులు పంటల సాగులో రసాయన మందుల వాడకాన్ని తగ్గించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత సూచించారు. గురువారం మండల పరిధిలోని ముద్విన్, కడ్తాల్, రావిచేడ్, మక్తమాదారం గ్రామాల్లోని రైతు వేదికల్లో, వ్యవసాయ శాఖ అధికారులు అన్నదాతలతో కలిసి ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. రైతులకు ఆహార భద్రత, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలు, మానవ శ్రేయస్సు కోసం నేల యొక్క ప్రాముఖ్యత తదితర అంశాల గురించి రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో మోతాదుకు మించి రసాయనలు వాడుతుండటంతో నేల విషతుల్యం కావడంతోపాటు, భూసారం దెబ్బతింటుందని ఏవో రైతులకు వివరించారు. అదే విధంగా నీరు ఎక్కువ కాలం ఒకే చోట నిల్వ ఉండటం వలన నేల సారాన్ని పోగొడుతుందని పేర్కొన్నారు. రైతులు తమ నేలలను సారవంతంగా ఉంచుకోవాలని, నేల కాలుష్యాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు అభినవ్, రమేశ్, వందన, అనూష, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

### బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 5 : ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాములుగౌడ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం శంకర్‌పల్లి రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 6 గ్యారంటీలు అమలు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి సమ్మక్క– సారలమ్మ మీద ఒట్టేసి చెప్పాడని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా రైతుబంధు జాడ లేదని, మహిళలకు రూ.2500, పింఛన్ పెంపు, పూర్తి స్థాయిలతో రైతు రుణమాఫీ అవ్వలేదని అన్నారు. హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ మున్సిపల్ ఇన్‌చార్జి వాసుదేవ్ కన్నా, మాజీ ఎంపీపీ నర్సింహులు, చేవెళ్ల బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయాంజాల్, డిసెంబర్ 5: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. గురువారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గం సమావేశం సంఘం ప్రధాన కార్యాలయంలో సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. రైతు సేవా సహకార సంఘంలో 19 మంది సభ్యులను చేర్చుకున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 22మంది రైతులకు రూ.2కోట్ల9లక్షల రుణాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. సంఘ సభ్యులకు ధీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను సభ్యుడికి గరిష్ఠంగా రూ.20 లక్షల నుంచి 25 లక్షలు, ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింగరావు, స్వప్న, యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, సంఘం కార్యదర్శి రాందాస్ పాల్గొన్నారు.

## ఏడాదిలో నాలుగు ఉద్యోగాలు

సౌమ్యరెడ్డి

మొయినాబాద్, డిసెంబర్ 5: మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డి ఏడాది కాలంలో నాలుగు ఉద్యోగాలు సాధించింది. బాలాపూర్ మండల పరిధిలోని నాదర్‌గుల్ ప్రాంతానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డి ఇంటర్ పూర్తి అయిన తరువాత 2014లో మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డితో వివాహం జరిగింది. వివాహం అనంతరం విద్యాభ్యాసాన్ని కొనసాగించి బీఎడ్, ఎంఎస్సీ పూర్తి చేసింది. 2023లో ఆగస్టులో గత ప్రభుత్వం నిర్వహించిన టీజీటీ, పీజీటీ, గురుకులాల లెక్చరర్ పరీక్షలు రాసింది. టీఎస్‌పీఎస్సీ గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించి జేఎల్ పరీక్ష కూడా రాసింది. ఈ ఏడాదిలో టీజీటీ, పీజీటీ, గురుకులాల పరీక్ష ఫలితాలు రాగా, అన్నింటిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఒకేసారి మూడు ఉద్యోగాలు పొందింది. ప్రస్తుతం చేవెళ్ల మండల పరిధిలోని ఊరేళ్ల గ్రామంలో ఉన్న బీసీ గురుకుల జూనియర్ ఇంటర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తుంది. 2023లో టీఎస్‌పీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు ప్రభుత్వం ఈ నెల 4వ తేదీన విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కూడా స్టేట్ 8వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం గురుకుల జూనియర్ కళాశాలలో చేస్తున్న ఉద్యోగం వదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చిన ఉద్యోగంలో ఆమె చేరే అవకాశం ఉంది.

## సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

ఆమనగల్లు, డిసెంబర్ 5: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మూడు జిన్నింగ్ మిల్లుల ద్వారా ప్రతిరోజూ 3 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మరో నెల రోజుల పాటు సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన పడవద్దని ఆయన సూచించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు మూసి వేస్తున్నారనే దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడం వల్ల తాత్కాలికంగా మూడు మిల్లుల్లో కొనుగోళ్లను తగ్గించారే తప్ప నిలిపివేయలేదన్నారు. నవంబర్ 27వ తేదీ వరకు కొనుగోలు చేసిన పత్తికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా డబ్బులు పడకపోతే మార్కెట్ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## స్ట్రీట్‌లైట్లు ఏర్పాటుచేయండి

కమిషనర్‌కు స్ట్రీట్ లైట్ల కోసం వినతిపత్రం ఇస్తున్న తారామతిపేట నేతలు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 5: మున్సిపాలిటీ పరిధి తారామతిపేటలోని మార్కెట్ యార్డులో సమస్యలు తీర్చాలని మాజీ ఉప సర్పంచ్ నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు కృష్ణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. యార్డులో వీధి దీపాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలు తీర్చాలని విన్నవించారు.

## మతిస్థిమితంలేని బాలుడి గుర్తింపు

మతిస్థిమితంలేని బాలుడిని తీసుకెళ్తున్న పోలీసులు

బడంగ్‌పేట్, డిసెంబర్ 5 : రాచకొండ కమిషనరేట్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెల్లగూడ స్వాగత్ గ్రాండ్ వద్ద గురువారం మతిస్థిమితం సరిగా లేని మాటలు రాని బాలుడు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న మీర్‌పేట్ పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడు వయసు సుమారు 8 సంవత్సరాలు ఉంటుందని, బాలుడికి మతిస్థిమితం సరిగాలేదని, తల్లిదండ్రుల వివరాలు తెలుపలేకపోతున్నాడని ఈ బాలుడి ఆచూకీ తెలిసిన వారు మీర్‌పేట్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## రేషన్ బియ్యం రాక లబ్ధిదారుల ఇక్కట్లు

చంపాపేట, డిసెంబర్ 5: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమో, లేక అధికారుల అలసత్వం మూలంగానో తెలియదు గానీ, ప్రతి మొదటి తేదీ నుంచి పౌరసరఫరాల విభాగం నుంచి సరఫరా కావాల్సిన రేషన్ బియ్యం నేటికి దుకాణాలకు సరఫరా చేయక పోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చంపాపేట, డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో ఉండే రేషన్ షాపులకు, ఇదే విధంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మరికొన్ని షాపులకు గురువారం నాటికి కూడా రేషన్ గోదాముల నుంచి సంబంధిత అధికారులు రేషన్ సరఫరా చేయలేదు. దీంతో లబ్ధిదారులు నిత్యం రేషన్ దుకాణాల వద్ద రేషన్ కోసం పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకే రేషన్ బియ్యం విక్రయాలు జరుగుతాయని ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. కానీ, సరైన సమయంలో షాపులకు సర్కులు సరఫరా చేయాలనే చిత్తశుద్ధి లేక పోవడం దుర్మార్గమని ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఎస్‌వోను వివరణ కోరగా అనివార్య కారణాలతో రేషన్ బియ్యం సరఫరాలో కొంత ఇబ్బందులు ఏర్పడి కొంత ఆలస్యం కావడం జరిగింది. రెండు రోజుల్లో అన్ని రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారని, పలు రైషన్ దుకాణాల నిర్వాహకులు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా అంత్యోదయ అన్నయోజన కార్డుల లబ్ధిదారులకు సరఫరా చేసే చక్కెర గత రెండు మాసాలుగా సరఫరా కావడం లేదని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు.

## వృద్ధురాలు అదృశ్యం

మలక్‌పేట, డిసెంబర్ 5: టీ త్రాగడానికని ఇంటినుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డిఅన్నారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డిఅన్నారం పోచమ్మ బస్తీకి చెందిన ఈశ్వరమ్మ ఈ నెల 3న 10.30 గంటలకు టీ త్రాగడానికని ఇంటినుంచి బయటి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈశ్వరమ్మ అప్పుడప్పుడు చాదర్‌ఘాట్‌లోని తెలిసిన వారి వద్దకు వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత తిరిగి వచ్చేదని, కానీ ఈసారి రాలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అంతరెడ్డి

మొయినాబాద్, డిసెంబర్ 5: ప్రజల సమస్యలపై ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా ప్రశ్నించే గొంతుకలను నొక్కి పెట్టడం కోసం ప్రభుత్వం అక్రమ అరెస్టు చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆ పార్టీ నేతలు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ ఎక్కడికక్కడ నిలదీస్తుంటే ప్రభుత్వానికి మింగుడు పడక అరెస్టులు చేస్తుండడం సరికాదన్నారు. ప్రజాక్షేత్రంలోకి బీఆర్ఎస్ నేతలు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుందామంటే ప్రభుత్వం పోలీసుల చేత అడ్డుకుని అరెస్టు చేయిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని చెప్పారు. గురుకుల విద్యార్థులు విష ఆహారం తిని ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు గురుకులాల బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గురుకుల పాఠశాలలను సందర్శించడానికి బీఆర్ఎస్ నేత , మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వెళితే అక్రమ కేసులు పెట్టడం ఏమిటని మండిపడ్డారు. పోలీసుల విధులను అడ్డుకున్నారని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయడంతో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి ఇంటిని సందరర్శించడానికి వెళితే అరెస్టులు చేశారని, ప్రజాపాలన కరువైందని ప్రభుత్వ తీరును ప్రజలు పరిశీలిస్తున్నారని తెలిపారు. అక్రమ అరెస్టులతో పోరాటాలను ప్రభుత్వం అణచివేయలేదన్నారు.

## ప్రజలను మోసంచేసి గద్దెనెక్కిన కాంగ్రెస్

### బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 5 : అబద్ధపు హామీలతో ప్రజలను మోసంచేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు.. నేడు విజయోత్సవాల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేస్తుందని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మైలారం విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అమలుకాని హామీల మ్యానిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చిన కాంగ్రెస్ నేడు ఏ ఒక్కటి కూడా నెరవేర్చకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతినెలా రూ.4వేల నిరుద్యోగ భృతి జాడేలేదు. విద్యార్థినులకు స్కూటర్లు పంపిణీ ఊసేలేదు. అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం. ఉద్యమకారులకు నెలకు రూ.2500 గౌరవ పెన్షన్ ఉద్యమకారుడికి గుర్తింపు కార్డు ఇవ్వలేదన్నారు. యూత్ కమిషన్ ఏర్పాటు చేసి యువతకు రూ.10లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామన్న మాట పూర్తిగా మరిచిపోయారన్నారు. ప్రైవేటు కంపెనీల్లో యువతకు 75శాతం రిజర్వేషన్ ఏడికి పోయాయని, ఇవ్వన్నీ పక్కనబెట్టి విజయోత్సవ సంబురాలు నిర్వహించటం సిగ్గుచేటని అన్నారు.

## సర్కార్‌పై పోరాటం చేస్తాం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచాల, డిసెంబర్ 5: ఆరు గ్యారంటీలు, అరవై ఆరు అబద్ధాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్యగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పి విస్మరించిందన్నారు. మూసీ ప్రక్షాలన, ఫోర్త్‌సిటీ పేరుతో ప్రజలను సీఎం పక్కదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు. హామీలను అమలు చేయకుంటే సర్కార్‌పై పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు భాషయ్య, రాజు, రాజేందర్‌రెడ్డి, రాజు గౌడ్, రమేశ్, రమేశ్, కృష్ణ, వినోద్, పూర్ణ చందు, అనిల్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## వడ్డెరుల సమస్యలను పరిష్కరించాలి

కడ్తాల్, డిసెంబర్ 5: వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి అన్నారు. వడ్డెరుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు ఇచ్చిన పిలుపు మేరకు, గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డిని వడ్డెర సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేరుస్తామని బహిరంగ సభలో ప్రకటించారని, ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. ప్రభుత్వం 16 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, వడ్డెరులకు ఏర్పాటు చేయకపోవడం బాధకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ